క్లుప్తంగా

విజయదుర్గాలయంలో రాహుకాల పూజలు



కడప కల్చరల్ : నగరంలోని శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై రాహుకాల పూజలు నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో ఈ పూజలు నిర్వహిస్తే రాహుకేతువు గ్రహ ప్రభావంతో ఏర్పడే బాధలు తొలగిపోతాయన్న విశ్వాసంతో జిల్లా నలుమూలల నుంచి భక్తులు విశేష సంఖ్యలో ఈ పూజలకు హాజరయ్యారు. ఆలయ ప్రధాన అర్చకులు ఫణిభూషణశర్మ భక్తులకు పూజా విధానాన్ని వివరిస్తూ కార్యక్రమం నిర్వహింపజేశారు. ఆలయ వ్యవస్థాపకులు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్‌భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ

కడప స్పోర్ట్స్ : నగరంలోని మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)కు చెందిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ ఫుట్‌బాల్ పోటీల్లో చక్కటి ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.నాగమణి తెలిపారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయిలో రజత పతకాలు సాధించిన విద్యార్థులు లక్ష్మి, అక్షయ, నక్షత్ర, యామిని, సవుదా, నాగరమ్యలను ఆమె అభినందించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ఎల్. వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

భారత చిత్రలేఖనం ప్రాచీనమైనది



మాట్లాడుతున్న డాక్టర్ కోట మృత్యుంజయరావు

వైవీయూ : ప్రపంచ చిత్రలేఖనాలలో భారతీయ సంప్రదాయ చిత్రలేఖనం అత్యంత ప్రాచీనమైనదని వైవీయూ లలితకళల విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు తెలిపారు. సోమవారం తిరుపతిలోని ఎస్.వి.సంప్రదాయ శిల్పకళా శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో 'భారతీయ ప్రాచీన శిల్పకళ వైభవం' అన్న అంశంపై ఆయన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాచీన చిత్రకళ గురించి వివరించారు. అనంతరం నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శిల్పకళ అధ్యాపకులు పాల్గొన్నారు.

చెరువును తలపిస్తున్న ఆర్టీసీ గ్యారేజ్



చెరువును తలపిస్తున్న ఆర్టీసీ గ్యారేజ్

కడప కోటిరెడ్డిసర్కిల్ : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు ఆర్టీసీ గ్యారేజ్ చెరువును తలపిస్తోంది. కొద్దిపాటి వర్షానికి జలమయం అయ్యే ఆర్టీసీ గ్యారేజ్ కార్మికులకు తీవ్రకష్టాలు తెచ్చిపెడుతోంది. రోజువారి పనులు చేసుకునే కార్మికులకు వర్షంనీరు తీవ్ర అడ్డంకిగా మారుతోంది. ముఖ్యంగా బస్సు కింద భాగంలో మరమ్మతులు చేసేందుకు ఏర్పాటు చేసిన గుంతలో నీళ్లు నిలబడటంతో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే గ్యారేజీలోని పలు ప్రాంతాలు జలమయం కావడంతో కార్మికులు నీటిలోనే దిగి పనులు చేయాల్సి వస్తోంది.

పోషకాహార లోప నివారణకే పోషణ్ పక్వాడా

కమలాపురం : చిన్నారులు, బాలింతలు, గర్భిణుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోషణ్ పక్వాడాను ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షంషాద్ బేగం తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచి జరుగుతున్న పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం 7వ వార్డు అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా–2023 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఐసీడీఎస్ ద్వారా అందిస్తున్న వైఎస్సార్ కిట్ (అటుకులు, రాగి పిండి, బెల్లం, కర్జూరం, చిక్కి), దాల్, రైస్, ఆయిల్, కోడిగుడ్లు, బాలామృతం, పాలు తదితర పోషకాహారాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు, జ్యోతి, రాణి, లక్ష్మీదేవి, గౌసియా, ఎలిజబెత్ రాణి, కిరణ్‌కుమారి, తులసి, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి

కడప ఎడ్యుకేషన్ : నేటి యువతకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శమని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నూర్జహాన్ అన్నారు. మంగళవారం సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురష్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి విద్యార్థినీ విద్యార్థులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోర్డినేటర్ రాజారావు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జయనగర్‌కాలనీ హైస్కూల్లో..
నగరంలోని జయనగర్‌కాలనీ హైస్కూల్లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు భాగ్యవతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హెలెన్ కెల్లర్ బదిరుల ఉన్నతపాఠశాలలో..
నగర శివార్లలోని హెలెన్ కెల్లర్ బధిరుల ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి కరస్పాండెంట్ దౌలత్‌ఖాన్, ప్రిన్సిపాల్ మసుదాబేగంలు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

మను పాలిటెక్నిక్ కళాశాలలో..
నగర శివార్లలోని మను పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీ రిటైర్డ్ ఇంగ్లీస్ ప్రొఫెసర్ ఓబుల్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. సమాజాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుడి పాత్ర ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మొహమ్మద్ అబ్దుల్ మఖ్సిత్‌ఖాన్, అధ్యాపకులు హాకీముద్దీన్, విలయత్‌ఆలీ, ఎన్‌ఎస్‌ఎస్ కోర్డినేటర్ మొహమ్మద్ ఖాజా మొయినుద్దీన్, మొహమ్మద్ సికిందన్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.







ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్నప్రిన్సిపాల్ నూర్జహాన్. జయనగర్‌కాలనీ జెడ్పీ హైస్కూల్‌లో.. సర్వేపల్లి చిత్రపటానికి పూలమాల వేస్తున్న కరస్పాండెట్, ప్రిన్సిపాల్

ఉన్నతమైన వృత్తి ఉపాధ్యాయవృత్తి
వైవీయూ : సమాజంలో అన్నింటికంటే ఎంతో ఉన్నతమైన వృత్తి ఉపాధ్యాయ వృత్తి అని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.సలీంబాషా తెలిపారు. మంగళవారం కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం కళాశాల పూర్వపు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుబ్బలక్షుమ్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ గురివిరెడ్డి, స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ విన్నీతేజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గురువు.. మన జాతి పరువు
కడప కల్చరల్ : గురువు మన జాతి పరువు అని ఇన్‌టాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ కె.చిన్నపరెడ్డి అభివర్ణించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గురువును దైవంగా భావించే సంస్కృతి మన దేశంలోనే ఉందని, ఇది ప్రపంచంలో మన కీర్తిప్రతిష్టలను పెంచుతోందన్నారు. అనంతరం ఇంటాక్ సభ్యులుగా ఉంటూ ఉపాధ్యాయ వృత్తి చేస్తున్న పదిమందిని సత్కరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, కో కన్వీనర్ పీవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణను ఆదర్శంగా తీసుకోవాలి
కడప కోటిరెడ్డిసర్కిల్ : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని యోగి వేమన యూనివర్సిటీ మాజీ ప్రధానాచార్యులు ప్రొఫెసర్ జి.సాంబశివారెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో మానవతా సంస్థ నగర అధ్యక్షుడు పి.సుబ్బరాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలిగినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఉత్తమ అధ్యాపకులను సత్కరించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కేంద్ర నియంత్రణా కమిటీ డైరెక్టర్లు రాటాల గోపి, అవటాల రామానుజులరెడ్డి, సెక్రటరీ లక్ష్మీనారాయణరెడ్డి, జాయింట్ సెక్రటరీ ప్రతాప్‌రెడ్డి, ఈసీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు జాతి దిక్సూచికలు



సత్కారం అందుకున్న ఉపాధ్యాయులతో ఆఫీసర్స్ క్లబ్ సభ్యులు

కడప కల్చరల్ : ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా, దిక్సూచికలుగా మలిచే త్యాగ జీవులని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా కడప ఆఫీసర్స్ క్లబ్ స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్ విభాగం సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం క్లబ్ సభ్యులుగా ఉన్న పలువురు ఉపాధ్యాయులను ఆయన సత్కరించి మాట్లాడారు. అనంతరం క్లబ్ పక్షాన పలువురు ఉపాధ్యాయులను, ఉపాధ్యాయ స్థాయి నుంచి ఎమ్మెల్సీగా ఎదిగిన ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని ఘనంగా సత్కరించారు. క్లబ్ సభ్యులు జానమద్ది విజయ్‌భాస్కర్, క్లబ్ కార్యదర్శి యదుభూషణ్‌రెడ్డి, క్లబ్ సభ్యులు, పలువురు విశ్రాంత అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

అలాగే స్థానిక రామకృష్ణ మిషన్‌లో, వివేకానంద విద్యానికేతన్ హైస్కూల్‌లో గురుపూజోత్సవం, శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అలాగే స్థానిక మౌలానా ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో గురువులను సంస్థ పక్షాన సత్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సమగ్ర శిక్షా అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డి గురుపూజోత్సవ ప్రాధాన్యతను తెలిపారు.



మాట్లాడుతున్న శ్రీకృష్ణ దేవరాయ యూనివర్సిటీ రిటైర్డ్ ఇంగ్లీష్ ప్రొఫెసర్ ఓబుల్‌రెడ్డి



ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో పూర్వపు ప్రిన్సిపాల్ దాక్టర్ పి.సుబ్బలక్షుమ్మను సన్మానిస్తున్న అధ్యాపకులు



ఇంటాక్ సభ్యులచే సత్కారం అందుకున్న గురువులు



ఉత్తమ అధ్యాపకులను సన్మానిస్తున్న మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు

క్రీస్తుకు మొదటి గురువు మరియ తల్లి



ప్రసంగిస్తున్న క్రైస్తవ గురువులు

కడప కల్చరల్ : లోక రక్షకుడు బాల యేసుగా ఉన్న రోజుల్లో ఆయనకు విద్యాబుద్ధులు మొదటిగా నేర్పినది మరియతల్లి అని రెవ ఫాదర్ బుజ్జిబాబు, రెవ ఫాదర్ విజయరాజులు అన్నారు. నగరంలోని రైల్వే స్టేషన్ వద్ద ఉన్న ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో నిర్వహిస్తున్న నవదిన ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజు, బుజ్జి బాబు దివ్యబలి పూజను సమర్పించగా, విజయరాజు దివ్య సందేశాన్ని అందించారు. అనంతరం చర్చి ఆవరణలో గీతాలు ఆలపిస్తూ ప్రదక్షిణ చేశారు. పాటలు తేరు దివ్య దివ్యబలి పీఠం అలంకరణ ఆరోగ్యమాత మదర్లు నిర్వహించారు. ఉపాధ్యాయుల దినోత్సవం పురస్కరించుకుని శాంతి సేవా సొసైటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్ర డైరెక్టర్ ఫాదర్ ఎండీ ప్రసాదరావు, సహాయ డైరెక్టర్ ఫాదర్ విల్సన్ ఆరోగ్యమాత మదర్లు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి షూటింగ్‌బాల్ ఎంపికలకు చక్కటి స్పందన



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఉత్తమారెడ్డి

కడప స్పోర్ట్స్ : నగరపాలక సంస్థ పరిధిలోని ఊటుకూరు టర్నింగ్‌పాయింట్ క్రీడామైదానంలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి షూటింగ్ బాల్ సీనియర్ విభాగం క్రీడాఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఈ ఎంపికలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన టర్నింగ్ పాయింట్ కోచింగ్‌సెంటర్ అధినేత ఉత్తమారెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకుని ఎంపికలు నిర్వహించి మాట్లాడారు. చదువుతో పాటు క్రీడలకూ చక్కటి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని సూచించారు. క్రీడల్లో రాణించడం ద్వారా శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండవచ్చన్నారు. జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మాదినేని నిత్యపూజయ్య మాట్లాడుతూ జిల్లా జట్టుకు ఎంపికయ్యే క్రీడాకారులు ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు నెల్లూరు జిల్లా కావలిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయాలు గుర్తించాలి



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్‌ఈ రమణ

కడప కార్పొరేషన్ : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యుత్ అంతరాయాలను గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ కడప సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ ఎస్.రమణ అన్నారు. మంగళవారం స్థానిక విద్యుత్ భవన్‌లోని ఎస్‌ఈ ఛాంబర్‌లో ప్రొటెక్షన్ విభాగపు అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులకు అంతరాయాలు లేని నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించుటకు సబ్ స్టేషన్లలో ముందస్తు మరమ్మతులు చేయాలన్నారు. ఆన్‌లైన్ ద్వారా విద్యుత్ అంతరాయాలను గుర్తించి, సంబంధిత అధికారులకు తెలియజేసి యుద్ధ ప్రాతిపదికన విద్యుత్‌ను పునరుద్ధరించుటకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. సబ్ స్టేషన్లలో ఉన్న సాంకేతిక సమస్యలను అధిగమించాలన్నారు. పవర్ ట్రాన్స్‌ఫార్మర్స్ వైఫల్యాలను పూర్తిగా అరికట్టాలన్నారు. ఈ సమావేశంలో ప్రొటెక్షన్ ఈఈ శ్రీనివాసులు, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

వినికిడి యంత్రాల పంపిణీ



వినికిడి యంత్రాలను పంపిణీ చేసిన డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : అనారోగ్య సమస్యలతో ఏ ఒక్కరూ ఆర్థికంగా ఇబ్బంది పడకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా అన్నారు. మంగళవారం స్థానిక డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో చెవులు సరిగా వినపడని వారికి వినికిడి యంత్రాలను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. పేద ప్రజలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే తగు పరిష్కారం చూపిస్తామన్నారు. నిరుపేదలకు పెద్ద జబ్బులు వస్తే వారి కుటుంబ పరిస్థితి ఎలా ఉంటుందో తమకు తెలుసని, రాష్ట్ర ప్రభుత్వం వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. నగరానికి చెందిన కొందరు తమకు వినికిడి యంత్రాలు అవసరమని అభ్యర్థించగా, ఆయన వెంటనే స్పందించి వారికి యంత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ షఫీ, కో ఆప్షన్ సభ్యుడు జహీర్, పస్తం అంజి పాల్గొన్నారు.

ముతవల్లీల సమస్యల పరిష్కారానికి కృషి
ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని ముతవల్లీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా అన్నారు. మంగళవారం స్థానిక డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్సీ రూహుల్లాతో కలిసి అన్నమయ్య, వైఎస్సార్ జిల్లాల మసీదుల ముతవల్లీతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వేర్‌హౌస్ కార్పొరేషన్ చైర్మన్ ఎస్పీ కరిముల్లా, హరూన్ గ్రూప్ సంస్థల ఎండీ అహ్మద్ బాషా, షేక్ ఖాజాబాషా పాల్గొన్నారు.

రేపు ఊటుకూరులో శ్రీకృష్ణాష్టమి వేడుకలు

కడప వైఎస్‌ఆర్/చింతకొమ్మదిన్నె : నగర శివార్లలోని 45వ డివిజన్ ఊటుకూరు గ్రామంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త నాగన్న తెలిపారు. సాయంత్రం వేణుగోపాలస్వామి ఊరేగింపు ఉంటుందన్నారు. భక్తులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

న్యాయ విజ్ఞాన సదస్సు

కడప ఎడ్యుకేషన్ : కడప గాంధీనగర్ హైస్కూల్లో మంగళవారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా వారు స్నేహపూర్వక న్యాయసేవల పథకం–2015చే గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, స్నేహపూర్వక స్వభావం, సోదరభావం, దేశభక్తి మొదలగు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం స్టాల్స్‌ను ఏర్పాటు చేసి పలు అంశాలకు సంబంధించిన కరపత్రాలను పిల్లలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీం సభ్యులైన న్యాయవాదులు, డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డి, డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి, ఉపాధ్యాయులు, పారా లీగల్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైలు కిందపడి మహిళ మృతి



కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప కనుములోపల్లి రైలు మార్గంలో రైలు కిందపడి గుర్తుతెలియని మహిళ మరణించిందని రైల్వే సీఐ నాగార్జున తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. మృతి చెందిన మహిళ వయసు 50 సంవత్సరాలు ఉంటుందని ఎల్లో జాకెట్టు, బ్లూ కలర్ చీర ధరించి చేతిపై హిందీ అక్షరాలతో పచ్చబొట్టు కలదన్నారు. కడప రిమ్స్ మార్చురీకి తరలించామని మృతురాలి ఆచూకీ తెలిసినవాళ్లు కడప రైల్వే పోలీసులను సంప్రదించాలని సీఐ తెలిపారు.

రాష్ట్ర స్థాయి సీనియర్ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపిక

జమ్మలమడుగు : ప్రభుత్వ డిగ్రీ కాలేజికి చెందిన జి.శ్రీనివాసులు అనే విద్యార్థి రాష్ట్ర స్థాయి సీనియర్ షూటింగ్ పోటీలకు ఎంపికైనట్లు కాలేజి ప్రిన్సిపల్ చంద్రశేఖర్, పీడీ షఫీలు పేర్కొన్నారు. ఈనెల 8న కావలిలో జరిగే పోటీలలో పాల్గొంటాడన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి సమరశీల పోరాటాలు



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లా సమగ్రాభివృద్ధికై సమరశీల పోరాటాలను నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర తెలిపారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన జిల్లా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. దశాబ్దాల తరబడి పోరాడి సాధించుకున్న గాలేరు నగరి, హంద్రీనీవా, తెలుగుగంగ ప్రాజెక్టుల్లో నీళ్లు ఉన్నప్పటికీ పంట కాలువల నిర్మాణం జరగలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పూర్తికి నిధులు నికరజలాల సాధన ద్వారా ప్రతి గ్రామానికి తాగునీరు ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు ఆయకట్టు రైతాంగాన్ని పోరాటాలకు సమాయత్తం చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్.నాగసుబ్బారెడ్డి, ఎం.వి.సుబ్బారెడ్డి, వి.వీరశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణతోనే మానవాళి మనుగడ



ఎల్‌ఐసీ పంపిణీ చేసిన మొక్కలతో విద్యార్థులు

కడప కల్చరల్ : పర్యావరణాన్ని కాపాడుకుంటేనే భూమి, మానవజాతి భద్రంగా ఉంటాయని ఎల్‌ఐసీ మార్కెటింగ్ మేనేజర్ శ్యాంసుందర్రావు అన్నారు. స్థానిక గాంధీనగర్ హైస్కూల్లో మంగళవారం 200 మంది విద్యార్థులకు మొక్కల పంపిణీ, అనంతరం 'పర్యావరణ పరిరక్షణకు ఏం చేయాలి' అన్న విషయంపై విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించి మాట్లాడారు. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకంపై అవగాహన పెంచేందుకు బీమా వారోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో పాఠశాల ప్రధానోపాధ్యాయిని సత్య సుజాత, ఓఎస్ మేనేజర్ సత్యప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. అలాగే కడప డివిజనల్ కార్యాలయంలో 'గురు దివస్' సందర్భంగా పెన్షనర్ల అభినందన కార్యక్రమం నిర్వహించారు.

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు



పట్టాలు తప్పిన గూడ్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఫెర్టిలైజర్స్ లోడ్తో చెన్నై నుంచి కడపకు వస్తున్న గూడ్స్ రైలు రైల్వేస్టేషన్ సమీపంలో భాకరాపేట వద్ద రాత్రి పట్టాలు తప్పింది. 42 వ్యాగన్లతో కడపకు వస్తున్న ఈ గూడ్స్ అందులో రెండు వేగన్లు పట్టాలు తప్ప కడప రైల్వేస్టేషన్ నుంచి మూడో ప్లాట్ఫారం మీదుగా భాకరాపేటకు చేరుకుని అక్కడ ఉన్న పాయింట్ నుంచి రివర్స్ వచ్చే క్రమంలో ఈ గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. రైల్వే ఏడీ ఈఎన్ రాధాకృష్ణ, ఏడీఎస్సీ కాత్యాకుమార్, స్టేషన్ మేనేజర్ డీఎన్‌రెడ్డి, సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్, రైల్వే ఆర్పీఎఫ్ శ్రీనివాసులు, జీఆర్పీ సాఐ నాగార్జునలు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. దీంతో రేణిగుంట వైపు నుంచి వెళ్లే రైళ్లు హైదరాబాదు ముంబైకి వెళ్లే రైళ్లకు ఆటంకం కలగనప్పటికీ కాచిగూడ నుంచి చెంగల్వపట్టు వెళ్లే ఎగ్మోర్ ఎక్స్‌ప్రెస్ గుంటూరు నుంచి తిరుపతి వెళ్లే తిరుపతి ఎక్స్‌ప్రెస్ రైలు ఆలస్యంగా నడవనున్నాయి.

ప్రజా సమస్యల పరిష్కారంలోనే సంతృప్తి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చెన్నూరు : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లినప్పుడు ప్రజలు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరించడంలోనే సంతృప్తి ఉందని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక గోసుల కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ కృతజ్ఞత సభలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారమై ప్రజలు సుఖంగా ఉన్నప్పుడు కలిగే సంతోషం అంతా ఇంతా కాదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దూరదృష్టి గల నాయకుడు కనుకే అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. గతంలో ఏవైనా సమస్యలు ఉంటే ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే వారని, నేడు ప్రభుత్వమే ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి

కమలాపురం : కమలాపురం మండలంలో పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యాన సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక ఏపీఎస్‌పీడీసీఎల్ ఏఈ కార్యాలయంలో విద్యుత్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు నెలల క్రితం కమలాపురంలో నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలు ఎంత వరకు పరిష్కారం అయ్యాయో ఏఈ చాంద్ బాషాను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. వర్షాకాలం కావడంతో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.